పెరిగిన వరిగడ్డి ధర


చిన్నతూండ్లలో విక్రయానికి సిద్ధంగా వరిగడ్డి

యాచారం, ఫిబ్రవరి 22: వరిగడ్డి ధర భగ్గుమంటోంది. నల్గొండ జిల్లా హాలియా ప్రాంతం నుంచి కొందరు వ్యాపారులు గడ్డిని ట్రాక్టర్లో తెచ్చి ఇక్కడ అమ్ముతున్నారు. మొన్నటి వరకు ట్రాక్టర్ లోడ్‌కు రూ.9వేలు ఉండగా నేడు అదే లోడ్ రూ.10వేలకు పెరిగింది. వరిగడ్డి కొతరతో రేటు పెరుగుతోందని పశుపోశకులంటున్నారు. ఎడ్లు, దూడలు, ఆవులు, గేదెలకు ఎండుగడ్డిని మేతగా వేస్తారు.

తక్కువ పెట్టుబడి, యేటా కచ్చితమైన ఆదాయం వచ్చే ఆయిల్ పామ్ సాగుకు రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. జిల్లాలో ఈ పంట సాగుకు అనువైన నేలలు ఉండడంతో 5,500 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు పెంచేలా చర్యలు తీసుకుంటోంది. ఇందుకు ప్రభుత్వం రైతులకు వివిధ రూపాల్లో సబ్సిడీలు, పెట్టుబడి, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తోంది. జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు ఇప్పటి వరకు 674 మంది రైతులు 3,033 ఎకరాల విస్తీర్ణంలో ఈ పంట వేసేందుకు అధికారులతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆయిల్ పామ్ సాగుచేసే ఎస్సీ, ఎస్టీలకు 100శాతం, బీసీలకు 90, ఇతరులకు 80శాతం చొప్పున ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్పు పరికరాలను అందజేస్తోంది. చీడపీడల బెడద, ప్రకృతి వైపరీత్యాల ప్రభావం, ఇతరత్రా నష్టభయాలు లేని ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని అధికారులు కోరుతున్నారు.



- ఎకరానికి ఏటా లక్ష వరకు ఆదాయం
- మొక్కలు నాటిన ఐదో ఏట నుంచి గెలలు
- అంతర పంటలతో అదనపు రాబడి
- సబ్సిడీపై డ్రిప్, ఇతర ప్రభుత్వ ప్రోత్సాహకాలు
- జిల్లాలో 5,500 ఎకరాల్లో సాగు చేయించాలని లక్ష్యం
- ఆయిల్ పామ్‌కు 674 మంది రైతుల రిజిస్ట్రేషన్
- ఇప్పటికే 86 మంది రైతులకు 331 ఎకరాల్లో అనుమతి

అధికాదాయాన్నిచ్చే.. ఆయిల్ పామ్!

(ఆంధ్రజ్యోతి-రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 22): పత్తి, వరి పంటలకే పరిమితమైన రైతులు ఆయిల్ పామ్ తోటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలకు సబ్సిడీలు, ప్రోత్సాహకాలు ఇస్తుండటంతో ఈ పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఇతర పంటలతో పోల్చితే దీనికి పెట్టుబడి ఖర్చులు, రిస్క్ తక్కువ. మన నేలలు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నాయి. దీంతో రంగారెడ్డి జిల్లాలో 5,500 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 674మంది రైతులు 3,033 ఎకరాల్లో ఆయిల్ పామ్‌కు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 86 మంది రైతులకు 331ఎకరాల్లో అయిల్ పామ్ సాగుకు పరిపాలన అనుమతులు మంజూరు చేసి 175 మొక్కలు నాటారు. 75 మంది రైతులకు 330 ఎకరాల్లో మంజూరు కోసం కలెక్టర్‌కు నివేదించారు. త్వరలోనే వారికి సబ్సిడీ మంజూరు అయ్యే అవకాశం ఉంది.

సాగుకు అనువైన నేలలు

దేశంలో వంట నూనె వినియోగం ఎక్కువ. వంట నూనె కోసం విదేశాల నుంచి పామాయిల్ గింజలను దిగుమతి చేసుకుంటున్నాం. ఈ నేపథ్యంలో ఆయిల్ పామ్ సాగుకు రైతులను ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆయిల్ పామ్ సాగుతో మలేషియా, ఇండోనేషియా దేశాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాయి. ఈ క్రమంలో తెలంగాణ రైతులు కూడా రాణించాలని రాష్ట్ర ప్రభుత్వం అయిల్‌పామ్ సాగును పెంచేలా రైతులను ప్రోత్సహిస్తోంది. ఈ ఏడాది 1.93లక్షల ఎకరాల్లో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగుకు అనువైన నేలలున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ఐదు జిల్లాల్లో 5 ఆయిల్ పామ్ కంపెనీల ద్వారా ఆయిల్‌పామ్ విస్తరణ, నర్సరీల నిర్వహణ, గెలల ప్రాసెసింగ్‌కు ఫ్యాక్టరీల ఏర్పాటుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోంది.

సాగు లక్ష్యం 5,500 ఎకరాలు

రంగారెడ్డి కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు జిల్లాలో ఈ సారి 5,500 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు ఉద్యానశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీకి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం కొంత మొత్తం ఇవ్వాలని నిర్ణయించింది. ఆయిల్ పామ్ సాగుకు కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులు కేటాయిస్తున్నాయి. రానున్న పదేళ్లలో పెరిగే డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం రాయితీపై డ్రిప్

ఆయిల్ పామ్ సాగు చేసే ఎస్సీ, ఎస్టీ రైతులకు బిందు సేద్యం పరికరాలను వదం శాతం సబ్సిడీపై ఇస్తున్నారు. బీసీ రైతులకు 90శాతం, ఇతర రైతులకు 80 శాతం రాయితీపై సాగు నీటి పారుదల పరికరాలు ఇస్తారు. 5హెక్టార్ల వరకు డ్రిప్పు రాయితీ ఇస్తారు. చిన్న, సన్నకారు రైతులకు, దివ్యాంగులకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇలా ఆయిల్ పామ్ రైతులకు 12.5ఎకరాల వరకు డ్రిప్ పరికరాలకు రాయితీ ఇస్తారు.

ఆయిల్ పామ్ ఉపయోగాలు

ఆయిల్ పామ్ మొక్కలు నాటిన తర్వాత నాలుగో ఏడాది నుంచి కాపు మొదలై 30ఏళ్ల పాటు నిరంతరం ఆదాయాన్ని పొందొచ్చు. మొదటి మూడేళ్ల మొక్కల మధ్యలో అంతర పంటలను సాగు చేసుకోవచ్చు. ఈ తోటకు తెగుళ్లు, చీడ పురుగుల బెడద చాలా తక్కువ. తుఫాన్, వడగండ్లు, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటుంది. అదే విధంగా అడవి పందులు, దొంగల బెడదా ఉండదు. రవాణా, మార్కెటింగ్, ప్రాసెసింగ్ సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుంది.



ప్రతీ ఎకరానికి సబ్సిడీ విధానం ఇదీ...

ఎకరం ఆయిల్ పామ్ సాగుకు మొక్కలు, డ్రిప్, అంతర పంటల సాగుకు, ఎరువుల యాజమాన్యం కోసం రూ.50వేల రాయితీ కల్పిస్తారు. ఆయిల్ పామ్ మొక్కలకు రూ.11,600, బిందు సేద్యం కోసం రూ.22,518 రాయితీ ఇస్తారు. మొదటి నాలుగేళ్లు ఎకరం అంతర పంటల కోసం రూ.2,100, అయిల్ పామ్ తోట యాజమాన్యం కోసం ఎరువులకు రూ.2,100, మొత్తం ఒక సంవత్సరానికి రూ.4,200 చొప్పున రైతు రన్నింగ్ బ్యాంక్ ఖాతాకు సబ్సిడీ మొత్తాన్ని జమ చేస్తారు.

తక్కువ పెట్టుబడి.. భారీ దిగుబడి..



నాటిన ఐదేళ్ల తర్వాత దిగుబడి

ఆయిల్ పామ్ మొక్క నాటిన సంవత్సరం నుంచి 5సంవత్సరాల తరువాత గెలలు వేస్తూ దిగుబడి వస్తుంది. ఈ పంట 25-30 సంవత్సరాల వరకు దిగుబడినిస్తుంది. ఒక ఎకరానికి సుమారు 10-12టన్నుల గెలలు వస్తాయి. సగటున ఒక టన్ను గెల ధర రూ.10వేలు ఉంటుంది. దీని ద్వారా ఒక రైతుకు ఒక ఏడాదికి ఎకరానికి రూ. 1.25లక్షల ఆదాయం పొందవచ్చు. ఈ విధానంలో 5ఎకరాలకు రూ.6లక్షల నికర ఆదాయం పొందుతారు. 5 ఎకరాలకు 20ఏళ్ల కాలంలో రూ.1.2కోట్ల వరకు ఆదాయాన్ని ఆర్జిస్తారు.

రైతులకు లాభదాయకం

ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభదాయకం. ప్రభుత్వం మొక్కలు, డ్రిప్‌పై సబ్సిడీలు ఇస్తుంది. నాలుగు సంవత్సరాల పాటు ఏటా ప్రతీ ఎకరానికి రూ.4,200 చొప్పున రైతు ఖాతాలో వేస్తుంది. ఈ పంటకు కోతులు, పందులు, పక్షుల బెడద. అలాగే ప్రకృతి విపత్తులతో నష్టం ఉండదు. మొక్కలు నాటిన ఐదో సంవత్సరం నుంచి మొక్కలకు గెలలు వస్తాయి. అప్పటి నుంచి ఎకరానికి ఏటా రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది. రైతులకు తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం అర్జించే అవకాశం ఆయిల్ పామ్ సాగులో ఉంటుంది.

- నీరజగాంధీ, ఇన్‌చార్జి జిల్లా ఉద్యాన శాఖ అధికారి

అయిల్ పామ్‌లో వివిధ అంతర పంటలు

అయిల్ పామ్ సాగులో అంతర పంటలుగా అరటి, బొప్పాయి, జామ, మల్బరీ, మొక్కజొన్న, కూరగాయలు, వేరుశనగ, శనగ, మినుము, పెసర, నువ్వులు, పొద్దుతిరుగుడు, కుసుమ, మిరప, పత్తి వేసుకొని ఆదాయం పొందొచ్చు. అయిల్ పామ్ సాగులో మెలకువలు పాటిస్తూ సాగుచేస్తే మంచి రాబడులు సాధించే అవకాశముంది. పంటను నేరుగా జిల్లా అనుబంధ కంపెనీ ఎంఎస్ వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ కొనుగోలు చేస్తుంది. ప్రభుత్వం నిర్ణయించిన ధర రైతులకు అందుతుంది. ఆయిల్ పామ్ విస్తరణ కార్యకలాపాల కోసం 11మంది సభ్యుల ఫీల్డ్ ఆఫీసర్లు జిల్లాలో పర్యటిస్తున్నారు.

ఎకరం వరికి అసరమయ్యే నీటితో 3-4 ఎకరాల్లో ఆయిల్ పామ్!

అయిల్ పామ్ సాగుకు వరి, కూరగాయ పంటలతో పోలిస్తే నీటి అవసనం తక్కువే. వేసవిలో నీరందే బోర్ల కింద సాగు చేయొచ్చు. ఎకరం వరి సాగుకు అవసరమయ్యే నీటితో 3 నుంచి 4 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేసుకోవచ్చు. ఎకరానికి 50నుంచి 57 మొక్కలు సమాంతర త్రిభుజాకార పద్ధతిలో నాటుకోవాలి.

నాటే మొక్కలు.. వయస్సు

మొక్కలు నాటే సమయంలో 12 నుంచి 14 నెలల వయస్సు ఉండి, 1 నుంచి 1.2 మీటర్లు ఎత్తు, 25 సెంటీ మీటర్లు మందం ఉండాలి. మొక్క 12 నుంచి 13 ఆకులు కలిగి ఉండాలి. భూమి బాగా దున్ని, అన్ని రకాలుగా తయారు చేసి, గుంతలు తీసి మొక్కలు నాటుకోవాలి.

అర్హులైన రైతులు వీరే..

అనువైన భూమి, పట్టాదారు పాస్ పుస్తకం, బోరు/బావి, కరెంట్ కనెక్షన్ ఉన్న ప్రతీ రైతు ఆయిల్ పామ్ సబ్సిడీకి అర్హుడే. రైతు ఎన్ని ఎకరాల్లో అయినా అయిల్ పామ్ సాగు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. ఇందుకు అవసరం అయ్యే ఆయిల్ పామ్ మొక్కలు రైతులకు రాయితీపై ఇస్తారు. కానీ బిందు సేద్యం(డ్రిప్) పరికరాల సబ్సిడీ మాత్రం 12.5ఎకరాల వరకు పరిమితం చేశారు.

వివరాలకు రైతులు సంప్రదించాల్సిన అధికారులు వీరే..

అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, మంచాల, ఇబ్రహీంపట్నం, యాచారం, మాడ్గుల, బాలాపూర్, సరూర్‌నగర్, శేరిలింగంపల్లి మండలాల రైతులు ఉద్యాన శాఖ అధికారి బి.కనకలక్ష్మి(ఫోన్ నం:7997725239), చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్, రాజేంద్రనగర్, గండిపేట, ఆమనగల్లు, కడ్తాల్ రైతులు ఉద్యానశాఖ అధికారి వి.అశోక్(9704118520)లను సంప్రదించాలి. షాద్‌నగర్, కేశంపేట, కొత్తూరు, నందిగామ, చౌదరిగూడెం, కొందుర్గు, తలకొండపల్లి రైతులు ఉద్యానశాఖ అధికారి టి.ఉషారాణి(7997725243), మహేశ్వరం, కందుకూరు, శంషాబాద్ మండలాల రైతులు ఉద్యానశాఖ అధికారి టీవై.సౌమ్యను 9177299489 అనే నంబర్‌లో సంప్రదించాలి.

దేశం గర్వించేలా మోదీ సంక్షేమ పథకాలు

- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్

మహేశ్వరం/శంషాబాద్ రూరల్/శంషాబాద్, ఫిబ్రవరి 22: ప్రపంచ దేశాల్లో భారత్ గర్వపడేలా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పథకాలు అమలు చేస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. బీజేపీ విజయ సంకల్ప యాత్ర గురువారం రాత్రి మహేశ్వరంలోకి ప్రవేశించింది. అమీర్‌పేట, చిన్న తూప్రా, మహేశ్వరం, తుక్కుగూడల్లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగుల్లో లక్ష్మణ్ మాట్లాడుతూ వందల సంవత్సరాలు ప్రజల కల సాకారమయ్యేలా అయోధ్యలో భవ్య రామ మందిరాన్ని నిర్మించి చరిత్ర సృష్టించిన మోదీ మూడో సారి ప్రధాని కావాలంటే రాష్ట్రంలో 17ఎంపీ స్థానాల్లోనూ బీజేపీ విజయం సాధించాలన్నారు. చేవెళ్ల స్థానం కూడా బీజేపీ ఖాతాలో చేరాలన్నారు. మోదీని ఓడించాలని కుట్ర పన్నుతున్న కుటుంబ పార్టీలకు ప్రజలు బుద్ధిచెప్పే రోజుల దగ్గరలోనే ఉన్నాయన్నారు. మహేశ్వరం ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన ఎమ్మెల్యే సబితారెడ్డి మాత్రం నగరంలోని మజ్లిస్ పార్టీకి చెందిన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పంపిణీ చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు పరిశ్రమల పేరుతో రైతుల భూములను కొట్టేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారన్నారు. దేవుని మాన్యాలనూ బీఆర్ఎస్ నాయకులు వదల్లేదన్నారు. మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల స్థానంలో బీజేపీకి పట్టు ఉందని, ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేయాలన్నారు. అంతకు ముందు యాత్ర శంషాబాద్ మండలం రామాంజపూర్‌లో ప్రవేశించింది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్, పంతంగి రాజ్‌భూపాల్‌ల ఆధ్వర్యంలో వందలాది మంది నాయకులు, కార్యకర్తలు యాత్రకు స్వాగతం పలికారు. మైలార్‌దేవులపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం హాజరయ్యారు. రామాంజపూర్ నుంచి పెద్దతూప్రా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. నర్కూడలో పార్టీ జెండాను ఎగరవేశారు. లక్ష్మణ్ మాట్లాడుతూ మొన్నటి వరకు కేసీఆర్ కుటుంబీకులు రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి శూన్యం అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 400 స్థానాల్లో గెలిచి బీజేపీ మళ్లా అధికారంలోకి రావడం తథ్యం అన్నారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర నాయకులు టి.వీరేందర్‌గౌడ్, పాపయ్యగౌడ్, అనంతయ్యగౌడ్, సుదర్శన్ రెడ్డి, జంగయ్యయాదవ్, అందెల శ్రీరాములుయాదవ్, ఎస్.మాధవచారి, సుదర్శన్‌యాదవ్, యాదయ్యగౌడ్, యాదీష్, నందీశ్వర్, రఘుపతిగౌడ్, చంద్రయ్యగౌడ్, కె.వెంకటేశ్, ప్రభాకర్‌రెడ్డి, రామ్‌రెడ్డి, ఆదిలక్ష్మి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, డాక్టర్ ప్రేమ్‌రాజ్, కుమార్‌యాదవ్, జూకల్ ఎంపీటీసీ బుక్క ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్ సిద్ధులు, కిట్టు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పాల్గొన్నారు.



మహేశ్వరం కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కె.లక్ష్మణ్

అమ్మా.. నన్ను అమ్మకే..!!

- రూ.25వేలు, తులం బంగారానికి ఆడ శిశువు విక్రయం
- ఆపై, మరో రూ.2లక్షలు డిమాండ్ చేసిన కన్నతల్లి
- చిన్నారిని వెనక్కిచ్చేసిన దంపతులు
- బస్తేపూర్‌లో అమానవీయ ఘటన

నేడు శిశువిహార్‌కు చిన్నారి తరలింపు


కన్నతల్లి సుజాతకు బిడ్డను అప్పగిస్తున్న రత్నమ్మ

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 22: కొడుకు మీద ఆశ, డబ్బు మీద అత్యాశ ఉన్న తల్లిదండ్రులకు పుట్టిన ఓ ఆడపిల్ల అంగట్లో బొమ్మలా మారింది. ఈ లోకంలోకి వచ్చి 20రోజులైనా కాకముందే శిశువు ఓ వస్తువులా చేతులు మారింది. ఇప్పటికే ముగ్గురు ఆడపిల్లలు కలిగిన ఓ తల్లి తన నాలుగో బిడ్డను 25వేల నగదు, తులం బంగారానికి అమ్మేసింది. ఆపై మరో రూ.2లక్షలు డిమాండ్ చేసింది. దీంతో బిడ్డను కొన్నవారు చేతులెత్తేయగా తిరిగి కన్న తల్లి చెంతకు చేరిన ఆ శిశువును అధికారులు శిశు విహార్‌కు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ అమానవీయ శిశు విక్రయ ఘటన చేవెళ్ల మండలం బస్తేపూర్‌లో వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల మల్లేష్, సుజాత దంపతులకు 2018లో వివాహమైంది. వీరికి ఇప్పటికే ముగ్గురు ఆడపిల్లలు ఉండగా కొడుకు కోసం నాలుగో సంతానానికి సిద్ధమయ్యారు. గర్భస్థ పరీక్షల్లో మళ్లీ ఆడపిల్లే అని తేలడంతో గర్భస్రావానికి ప్రయత్నించి వైద్యుల సూచనలతో వెనక్కి తగ్గారు. ఈ క్రమంలో చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ఫిబ్రవరి 3న సుజాత ఆడ శిశువును ప్రసవించగా అంగన్‌వాడీ కేంద్రంలో పాప పేరు సిరి అని నమోదు చేయించారు. అయితే, పోషణ భారం మోయలేక షాద్‌నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం అరిటాకులకు గ్రామానికి చెందిన రామచంద్రయ్య-రత్నమ్మ దంపతులకు సిరిని అమ్మేశారు. వారి నుంచి రూ.25వేలు, తులం బంగారు చైన్ తీసుకుని విషయాన్ని గుట్టుగా ఉంచారు. అయితే, చిన్నారి సిరి తల్లిదండ్రుల వద్ద లేదని గుర్తించిన స్థానిక అంగన్‌వాడీ టీచర్ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. మరోపక్క, రామచంద్రయ్య దంపతులకు ఫోన్ చేసిన సుజాత తనకు మరో రూ.2లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయగా గొడవ జరిగింది. చివరికి శిశు విక్రయం గురించి తెలుసుకున్న శిశు సంక్షేమ శాఖ అధికారులు చిన్నారి సిరిని గ్రామానికి రప్పించారు. సిరిని అధికారికంగా దత్తత తీసుకునేందుకు రామచంద్రయ్య దంపతులు ముందుకు రాగా.. సుజాత మాత్రం రూ.2 లక్షల కోసం పట్టుబట్టింది. దీంతో సుజాత నుంచి భవిష్యత్తులో వేధింపుల ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో రామచంద్రయ్య దంపతులు శిశువును తల్లికి అప్పగించారు. కాగా, శిశువును శుక్రవారం శిశు విహార్‌కు తరలిస్తామని బాలల సంరక్షణ జిల్లా అధికారి దేవేందర్‌చారి తెలిపారు. సుజాత దంపతులకు కౌన్సిలింగ్ ఇస్తామన్నారు.

ఉప్పరిగూడ ప్యాక్స్‌లో అవిశ్వాసం

- కోర్టు స్టే కారణంగా ఫలితం నిలిపివేత


అవిశ్వాస పరీక్షకు హాజరైన సొసైటీ డైరెక్టర్లు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 22: ఇబ్రహీంపట్నం పరిధి ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లపై గురువారం అవిశ్వాసానికి ఓటింగ్ జరిగినప్పటికీ కోర్టు స్టే కారణంగా అధికారి ఫలితాన్ని నిలిపివేశారు. వివరాల్లోకి వెళితే.. ఉప్పరిగూడ సొసైటీలో మొత్తం 13మంది డైరెక్టర్లు ఉన్నారు. వారిలో ఏడుగురు బీఆర్ఎస్, ఆరుగురు కాంగ్రెస్ మద్దతుదారులు. ఛైర్మన్‌గా టేకుల సుదర్శన్‌రెడ్డి, వైస్ ఛైర్మన్‌గా క్యామ శంకర్ ఉన్నారు. వీరిద్దరూ బీఆర్ఎస్‌కు చెందిన వారే. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానికంగా రాజకీయ పరిస్థితులు మారుతున్నాయి. కొన్ని రోజుల క్రితం ఛైర్మన్, వైస్‌ఛైర్మన్లపై మెజార్టీ సభ్యులు అవిశ్వాసాన్ని ప్రకటించారు. తీర్మానంపై సంతకాలు చేసిన వారిలో ఆరుగురు కాంగ్రెస్ డైరెక్టర్లు, ఐదుగురు బీఆర్ఎస్ డైరెక్టర్లున్నారు. డీసీవో ధాత్రీదేవి గురువారం ఉదయం 11.30గంటలకు అవిశ్వాస పరీక్ష సమావేశానికి హాజరుకావాలంటూ డైరెక్టర్లకు నోటీసులు ఇచ్చారు. అయితే నిబంధనల ప్రకారం అవిశ్వాస నోటీసు ఇవ్వలేదంటూ ఛైర్మన్ సుదర్శన్‌రెడ్డి హై కోర్టును ఆశ్రయించారు. దీంతో అవిశ్వాస పరీక్ష నిర్వహించినా ఫలితాన్ని ప్రకటించొద్దని హైకోర్టు బుధవారం సాయంత్రం స్టే ఇచ్చింది. మొదట నిర్ణయించిన మేరకు డీసీవో ధాత్రీదేవి గురువారం సొసైటీ కార్యాలయంలో అవిశ్వాస పరీక్ష నిర్వహించారు. మీటింగ్‌కు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల డైరెక్టర్లు 11 మంది హాజరయ్యారు. వారిలో ఏదుల్ల పాడురంగారెడ్డి, జంగారెడ్డి, విశాల, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పుల్లయ్య, పోశమ్మ, జంగయ్య, సత్తయ్య, అశోక్ ఓటింగ్‌లో పాల్గొన్నారు. వివరాలు రికార్డు చేసుకున్న డీసీవో హైకోర్టు స్టే ఉన్నందున ఫలితాన్ని వెల్లడించకుండా వెళ్లిపోయారు. అవిశ్వాస తీర్మాన ఓటింగ్ వివరాలను కోర్టుకు సమర్పిస్తామని డీసీవో తెలిపారు. కాగా దీనిపై మార్చి 7న విచారణ జరుగనున్నట్టు సమాచారం.



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 22 : వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, నీటిపారుదల శాఖల అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్షించారు. వేసవిలో తాగునీటి సమస్య వచ్చే ప్రాంతాలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగనివ్వొద్దన్నారు. తాగునీటి సరఫరాపై పూర్తి వివరాలు సేకరించి సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. నీటి ట్యాంకుల పైపులైన్ లీకేజీలు గుర్తించాలని తెలిపారు. అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పని చేయని బోర్లు, పంపుసెట్లను గుర్తించి మరమ్మతులు చేయించాలన్నారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించాలని తెలిపారు. రానున్న 3నెలలు అత్యంత కీలకమని, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఏఈలు రోజూ క్షేత్రస్థాయిల్లో, డీఈలు మండలాల్లో ఉండాలని ఆదేశించారు.

ఉపాధి కూలీలకు నీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలి

వేసవిలో ఉపాధి హామీ కూలీలకు పనిచేసే ప్రాంతాల్లో నీరు, మెడికల్ కిట్ వంటివి అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీని ఆదేశించారు. నర్సరీలపై శ్రద్ధ వహించి మొక్కలు ఎండిపోకుండా నీరు పోయిస్తూ కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, అదనపు పీడీ సుభాషిణి, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, ఇరిగేషన్ అధికారులు, ఎంపీడీవోలు, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మంచాల, ఫిబ్రవరి 22 : విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత ఉపాధి హామీ సిబ్బందిని హెచ్చరించారు. గురువారం మండలంలో పర్యటించి ఉపాధి హామీ పనులు, పల్లె ప్రకృతి వనం, నర్సరీలను ఆమె పరిశీలించారు. మొదట ఆరుట్లలో పని ప్రదేశానికి వెళ్లి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. కొలతల మేరకు పని చేసి వేతనం పొందాలని సూచించారు. మస్టర్ రికార్డులను సక్రమంగా చేయాలని, నర్సరీల్లో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో బాలశంకర్, ఇబ్రహీంపట్నం క్లస్టర్ ఏపీడీ సక్రియానాయక్, ఏపీఓ వీరాంజనేయులు, వాటర్‌షెడ్ పీవో సంధ్య, ఈసీ విమల, టీఏలు శేఖర్, మహేశ్, ప్రభాకర్, స్వామి, కోటేశ్వర్ ఉన్నారు.

శామీర్‌పేట, ఫిబ్రవరి 22: శామీర్‌పేట పెద్ద చెరువు కట్ట మైసమ్మ ఆలయ నూతన చైర్మన్‌గా విలాసాగరం అశోక్‌ను గ్రామ ప్రజలు, భక్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శామీర్‌పేట గ్రామంలో వివిధ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు గురువారం పెద్ద ఎత్తున సమావేశాన్ని నిర్వహించి కట్ట మైసమ్మ

కట్ట మైసమ్మ ఆలయ చైర్మన్‌గా అశోక్


అశోక్

ఆలయ నూతన కమిటీ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికలో వారు అశోక్‌ను కట్ట మైసమ్మ అమ్మవారు ఆలయ కమిటీ నూతన చైర్మన్‌గా, కోశాధికారిగా దూడల వెంకటేశ్‌గౌడ్, సలహాదారుగా గుర్రం సునీల్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


జన సంద్రమైన జంపన్నవాగు పరిసర ప్రాంతాలు

శిగాలూగుతున్న వనం


చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకువస్తున్న పూజారులు


సమ్మక్కకు మొక్కుగా గొర్రెపిల్లను ఎదుర్కోలు ఇస్తున్న భక్తుడు



- మేడారం జాతరకు పోటెత్తుతున్న భక్తులు
- గద్దెపైకి సమ్మక్క రావడంతో జోరుగా మొక్కులు
- ప్రశాంతంగా ముగిసిన అద్వితీయ ఘట్టం
- పతాక స్థాయికి 'వన' సంరంభం
- కిటకిటలాడిన తల్లుల గద్దెలు

మేడారం బృందం, ఫిబ్రవరి 22: సమ్మక్క - సారలమ్మ జాతరతో వనం శిగాలూగుతోంది. మేడారం భక్తిపారవశ్యంతో మురిసిపోతోంది. మహాజాతరలో తొలిరోజైన బుధవారం అర్ధరాత్రి సారలమ్మ గద్దెపై కొలువు దీరగా.. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రెండోరోజైన గురువారం ఉదయం నుంచి జరిగిన ప్రత్యేకపూజల అనంతరం మాఘశుద్ధ పౌర్ణమి వెలుగుల్లో చిలుకలగుట్ట నుంచి జనంలోకి వచ్చిన సమ్మక్క.. గద్దెపై కొలువుదీరారు. ఆ అమ్మ ఆగమనంతో జాతర పతాకస్థాయికి చేరింది. తల్లిని దర్శించుకునేందుకు ఎదురుచూసిన లక్షాలాది భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ప్రస్తుతం మేడారం పరిసరాల్లో కోటి మందికిపైగా భక్తులు విడిది చేసి ఉన్నారు. శుక్రవారం భక్తుల రాక రెట్టింపు కానుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఎటుచూసినా ఇసుకేస్తే రాలనంత జనంతో మేడారం.. పుణ్యస్నానాలు చేసే వచ్చే భక్తులతో జంపన్నవాగు తీరం.. తల్లులను దర్శించుకుంటున్న భక్తులతో గద్దెల ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి.

గద్దెపైకి సమ్మక్క

గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకోవడంతో జాతరలో ఓ అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఉదయమే పూజారులు మేడారంలోని సమ్మక్క గుడిలో సమ్మక్కను తరలించే ప్రక్రియను ప్రారంభించి.. ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత పూజారుల బృందం అడవికి వెళ్లి కంకవనాన్ని తీసుకురాగా.. ఈ తంతులో మంత్రి ధనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. కంకవనాన్ని సమ్మక్క గద్దెపై ఉంచి పూజలు చేశారు. సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య నేతృత్వంలో పూజారుల బృందం చిలుకల గుట్టకు బయలు దేరింది. మధ్యలో క్రిష్ణయ్య ఒక్కరే సమ్మక్క స్థావరం వద్దకు వెళ్లి పూజలు చేశారు. తల్లి కుంకుమ భరిణె రూపాన్ని తీసుకొని కిందకు చేరుకున్నారు. ఈ క్రమంలో ములుగు ఎస్పీ శబరీష్ గాల్లోకి కాల్పులు జరిపి వందనం సమర్పించారు. మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. రోప్ పార్టీ బలగాల సాయంతో పూజారులు సమ్మక్కను మేడారం గద్దెకు తోడ్కొని వచ్చారు. ఈ క్రమంలో భక్తులు పలు చోట్ల కోళ్లు, మేకలను బలి ఇచ్చారు. గద్దెల వద్ద సమ్మక్కను ప్రతిష్ఠించిన అనంతరం ప్రత్యేక పూజలు చేసి ఆ తర్వాత భక్తులకు దర్శనానికి అనుమతిచ్చారు. అయితే బుధవారమే సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజు గద్దెలపైకి చేరుకోగా.. సమ్మక్క రాకతో జాతరకు పరిపూర్ణత వచ్చింది. సమ్మక్క వన ప్రవేశం జరిగే శనివారం సాయంత్రం వరకు భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు.


సమ్మక్క గద్దె


క్యూలైన్లలో భక్తుల రద్దీ









ప్రముఖుల రాక

గురువారం పలువురు ప్రముఖులు మేడారాన్ని సందర్శించారు. కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు తల్లులను దర్శించుకున్నారు. మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత తదితరులు మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు మేడారానికి వస్తున్నారు.

కమనీయంగా లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం

- భారీగా తరలివచ్చిన భక్తులు
- పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కడ్తాల్, ఫిబ్రవరి 22 : కడ్తాల్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. సమీప ప్రాంతాల నుంచే కాకుండా నగరం నుంచి సైతం భారీగా భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించి తన్మయులయ్యారు. ఈ ఉత్సవాలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అర్చకుడు మెశ్లూరి వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఉత్సవ, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్లు టి.వేణుగోపాల్, పాలాది ఆంజనేయులు, ఈవో మోహన్‌రావు ఉత్సవాల కోసం ఏర్పాట్లు చేశారు. అర్చకులు శ్రీధర్, నర్సింహమూర్తి, శ్రీమన్నారాయణ, వేణుగోపాల్ పూజాకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జి.శ్రీనివాస్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ గంప వెంకటేశ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, యాట నర్సింహ, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్, యాదగిరిరెడ్డి, నరేందర్‌రెడ్డి, హన్మానాయక్, శ్రీకాంత్‌రెడ్డి, ఎం.కృష్ణ, జంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, చెన్నకిషన్‌రెడ్డి, మల్లప్ప, కేశవరెడ్డి, బుచ్చయ్య, మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


భక్తులకు తాళి చూపిస్తున్న అర్చకులు

దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం

ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం చేస్తాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో గడిపేవారు ఆనందమయ జీవితాన్ని ఆస్వాదిస్తారన్నారు. లక్ష్మీ చెన్నకేశవస్వామి పూజల్లో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పురాతన ఆలయాల పునరుద్ధరణకు కృషి చేస్తానన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

అర్చకులకు చేయూత

లక్ష్మీచెన్నకేశస్వామి ఆలయంలో నిత్య పూజలు నిర్వహిస్తున్న అర్చకులకు డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి చేయూతనిచ్చారు. అర్చకుల గౌరవవేతనాల కోసం ఆయన ఏటా రూ.60వేలు ఇస్తున్నారు. గురువారం ఈ మొత్తాన్ని అర్చకులకు అందజేశారు. అర్చకులకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డిని సత్కరించారు.


స్వామి వారి విగ్రహాలకు హారతి ఇస్తున్న భక్తులు

'పట్నం' బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 22 : 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.13.10 కోట్లతో అంచనా బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. గురువారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి అధ్యక్షతన జరిగిన బడ్జెట్ సమావేశానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. కమిషనర్ రవీందర్‌సాగర్ బడ్జెట్‌ను కౌన్సిల్ ముందుంచారు. పన్నుల ద్వారా రూ.5.15 కోట్లు, నాన్‌టాక్సుల ద్వారా రూ.2.28 కోట్ల ఆదాయం సమకూరనున్నట్లు చెప్పారు. మిగతా మొత్తాన్ని ఇతర గ్రాంట్ల ద్వారా రాబట్టనున్నట్లు తెలిపారు. రూ.5.23 కోట్లు చార్జ్‌డ్ ఖర్చులను చూపగా, శానిటేషన్ సిబ్బంది జీతభత్యాలు, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ చార్జీలు చూపారు. బడ్జెట్‌లో 10 శాతం గ్రీన్ బడ్జెట్ కింద చూపారు. గతేడాది మార్చిలో బడ్జెట్ రూ.18.48 కోట్ల అంచనాతో కౌన్సిల్ ఆమోదం పొందినా డిసెంబరు 31 వరకు రూ.4.81 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు చూపారు. పట్టణ ప్రగతి నిధులు ఆరు నెలలుగా రాలేదని చెప్పారు. సవరణ బడ్జెట్ అంచనాను రూ.10.10 కోట్లుగా చూపారు. టాక్సుల రూపేణా రూ.5.43 కోట్లు అంచనా ఉండగా డిసెంబరు 31 వరకు రూ. 2.58 కోట్లు మాత్రమే రాబట్టామని మిగతా మొత్తాన్ని మార్చి నెలాఖరుకల్లా రాబట్టనున్నట్లు తెలిపారు. వైస్‌చైర్మన్ ఆకుల యాదగిరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

ఈ నెలాఖరు వరకు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీలో రోజుకు 40 లక్షల లీటర్ల తాగు నీరు సరఫరా చేస్తున్నామని, వేసవిని దృష్టిలో ఉంచుకుని అదనంగా పది లక్షల లీటర్ల నీటిని ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు తాగునీటి కోసం నల్లాకనెక్షన్ ఇవ్వాలని సూచించారు.

లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందడానికే సీఎం సభ

- వికారాబాద్‌కు ఏమిస్తారో సీఎం చెప్పలేదు
- నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతలను వికారాబాద్ వరకు పొడిగించాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందడానికే కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి సభ నిర్వహించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డి గురువారం ఓ ప్రకటనలో చెప్పారు. ప్రజలకు అబద్ధాలు చెప్పి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్‌కు ఆరు గ్యారెంటీలు అమలు చేసే సత్తా లేదన్నారు. విభజన చట్టంలో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును కాంగ్రెస్ ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. గోదావరి, కృష్ణా నీళ్లు రాకపోవడంతో జిల్లాలోని సాగుభూములు బీడుభూములుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. వికారాబాద్ తన జిల్లా అంటూ పదే పదే చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి ఈ నియోజకవర్గానికి ఏమిస్తారనేది ఎందుకు చెప్పడంలేదని ప్రశ్నించారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని వికారాబాద్ వరకు పొడిగించి ఈ ప్రాంత రైతులకు నీళ్లు అందించాలని కోరారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు సోయి తెచ్చుకుని నీళ్లు ఇవ్వాలని సీఎంను కోరాలని సూచించారు. ఆ పార్టీ నేతలు బీఆర్ఎస్ లాగే అహంకార పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ విజయసంకల్ప యాత్రకు ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసి కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారని చెప్పారు. పదేళ్ల పాలనలో మోదీ చేసిన అభివృద్ధిని వివరిస్తూ యాత్ర చేస్తున్నామని, అందుకే బీజేపీ, బీఆర్ఎస్ ఒప్పందం ఉందంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. కేంద్రప్రభుత్వం సహకారం లేకుండా రాష్ట్రప్రభుత్వం ఒక్క పని కూడా చేయలేదని ఆయన చెప్పారు.


మాధవరెడ్డి

ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

- మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సుధారాణి

వికారాబాద్, ఫిబ్రవరి 22 : విదేశ యూనివర్సిటీలలో చదవడానికి ఆగస్టు 1 నుంచి 31 డిసెంబర్ 2023 మధ్య అడ్మిషన్ తీసుకున్న మైనారిటీ విద్యార్థులు ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం ద్వారా స్కాలర్‌షిప్, ఆర్థికసహాయం కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి డి సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందు కోసం దరఖాస్తుదారుని కుటుంబ సంవత్సర ఆదాయం రూ.5 లక్షల లోపు ఉండాలన్నారు. ఇంజనీరింగ్‌లో పీజీ చేయడానికి 60 శాతం, డాక్టరేట్ చదవడానికి పీజీలో 60 శాతం మార్కులు ఉండాలని చెప్పారు. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, న్యూజిలాండ్, దక్షిణకొరియాల్లోని యూనివర్సిటీలలో అడ్మిషన్ పొంది ఉండాలని, మిగతా వివరాల కోసం మైనారిటీ సంక్షేమ శాఖ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు. అర్హత కలిగిన వారు మార్చి 23 సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్, దరఖాస్తు కాపీ, 3 జతల జిరాక్స్ కాపీలను మార్చి 30న సాయంత్రం 5 గంటల్లోపు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని చెప్పారు. ఎంపికయిన విద్యార్థులకు రూ.20 లక్షల ఉపకారవేతనం, రూ.60వేలు విమానచార్జీలు చెల్లిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. వివరాలకు 9440685713 సంప్రదించాలన్నారు.


సుధారాణి

బాల్య వివాహాలను అరికట్టాలి

- బాలల పరిరక్షణ విభాగం జిల్లా అధికారి భానుప్రకాష్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న భాను ప్రకాష్

కొందుర్గు, ఫిబ్రవరి, 22 : బాల్య వివాహాలను అరికట్టాలని బాలల పరిరక్షణ విభాగం జిల్లా అధికారి భానుప్రకాష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పులుసుమామిడి శివారులో ఉన్న కేజీబీవీలో బాలల హక్కులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కులు, అక్రమ దత్తత, అక్రమ రవాణా, బాలకార్మికులు, చైల్డ్ హెల్ప్ లైన్ 1908, భిక్షాటన, లింగ వివక్షత, సేఫ్ టచ్, అన్‌సేఫ్‌టచ్ గురించి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. షాద్‌నగర్ సీడీపీవో నాగమణి మాట్లాడుతూ విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని, కష్టపడి కాకుండా, ఇష్టపడి చదవాలని, సూచించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ శకీనానిస్సీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేవతి, అంగన్‌వాడీ టీచర్లు సంగీత, రాజమణి, ప్రేమలత, పాఠశాల ఉపాధ్యాయులు అనురాధ, ఉమాదేవి, సునిత, పల్లవి, కల్పన, మల్లీశ్వరి పాల్గొన్నారు.

సొంత గూటికి రావడం సంతోషకరం

- మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 22 : గతంలో కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్, బీజేపీలో చేరిన నాయకులు తిరిగి సొంత గూటికి రావడం సంతోషకరమని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని బాచుపల్లి, జైత్వారం గ్రామాల నుంచి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు గురువారం తుక్కుగూడలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ రోజు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని, ఇక్కడికి వచ్చే వారిలో ఎక్కువ మంది ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అనుచరుల బాధితులే ఉన్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు చిక్కుముడులు పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని మండిపడ్డారు. బాచుపల్లి, జైత్వారానికి చెందిన వెంకటేష్, మహేందర్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. కృష్ణానాయక్, జంగారెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.


లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

కార్యకర్తల నిర్ణయానికి కట్టుబడి ఉంటా : పీవీఆర్



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్, ఫిబ్రవరి 22 : తన రాజకీయ భవిష్యత్తుపై కార్యకర్తలు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటానని ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి(పీవీఆర్) స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని ఆయన నివాసంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల్లో కార్యకర్తల కృషి ఫలితంగా తనకు 32వేల ఓట్లు వచ్చాయని, తనకు అండగా నిలిచిన కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు ఎన్నికల బరిలో నిలవాలన్నారు. మోహన్‌సింగ్, లష్కర్‌నాయక్, ఇస్నాతి భాస్కర్, ఆకుల ప్రదీప్, ఇస్నాతి శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, సుధాకర్, శ్రీరాంరెడ్డి, నరేందర్‌రెడ్డి, కుమార్‌గుప్తా, శివారెడ్డితో గ్రామాల నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

షాద్‌నగర్, ఫిబ్రవరి 22 : మహిళల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, త్వరలోనే మరిన్ని కొత్త పథకాలు తీసుకురాబోతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. గురువారం షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో 70మంది లబ్ధిదారులకు రూ.70.81లక్షల కల్యాణ లక్ష్మి, 28 మందికి 28.32లక్షల షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి తొలి ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఇదివరకే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10లక్షల ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. త్వరలోనే రూ.500లకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందజేయబోతుందని తెలిపారు. తహసీల్దార్ పార్థసారథి, జడ్పీటీసీ వెంకట్‌రామ్‌రెడ్డి, ఎంపీడీవో బన్సిలాల్, ఎంపీటీసీలు భార్గవరెడ్డి, శ్రీశైలం, కౌన్సిలర్ శ్రీనివాస్‌తో పాటు పార్టీ నాయకులు బాలరాజ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సయ్యద్ ఖదీర్ పాల్గొన్నారు.



షాద్‌నగర్ : చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆరు గ్యారెంటీ పథకాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రతీ గడపకు తీసుకువెళ్లాలని సూచించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అందె మోహన్, షాద్‌నగర్ నియోజకవర్గ కార్యనిర్వాహక అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్‌తో పాటు బాబర్‌ఖాన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఎన్ సేవలు అభినందనీయం

షాద్‌నగర్ రూరల్ : గ్రామీణ ప్రాంతాల పేదలకు ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్(ఎఫ్‌సీఎన్) సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్ పట్టణం చటాన్‌పల్లి శివారులో ఉన్న ఎఫ్‌సీఎన్ సంస్థ నిర్వాహకులు డాక్టర్ గీతా థామస్‌రెడ్డి ఆధ్వర్యంలో షాద్‌నగర్ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన పేద వృద్ధులు దాదాపు 400 మందికి దుస్తులు, దుప్పట్లు, గొడుగు, స్టీల్ వాటర్ బాటిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ మానవసేవే మాధవసేవగా డాక్టర్ గీతా థామస్‌రెడ్డి దంపతులు పేదలకు సేవలందిస్తున్నారని తెలిపారు. తన వంతు సహాయంగా ఒక్కొక్కరికి రూ.500 చొప్పున ఇచ్చేందుకు రూ.2 లక్షల చెక్కును ఆయన అందజేశారు. సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సేవలు చేస్తున్నామని తెలిపారు. ఎంతో మంది మహిళలకు స్వయం ఉపాధి రంగంలో శిక్షణ ఇచ్చి వందల మందికి కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేసినట్లు వారు తెలిపారు.

క్రైం కార్నర్

లారీ ఢీకొని ఉపాధ్యాయుడు మృతి

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 22: లారీ ఢీకొని ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతిచెందాడు. ఈ ఘటన షాద్‌నగర్ ముఖ్య కూడలిలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం షాబాద్ మండల కేంద్రానికి చెందిన నీరటి కృష్ణ(47) చౌదరిగూడ మండలం గాలిగూడలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన తన కుటుంబ సభ్యులతో ఆరె మైసమ్మ దగ్గర నివాసముంటూ నిత్యం పాఠశాలకు వచ్చివెళుతుంటారు. గురువారం పాఠశాల ముగిసిన తర్వాత మరో ఉపాధ్యాయుడితో కలిసి బైక్‌పై షాద్‌నగర్‌కు చేరుకొని ముఖ్య కూడలిలో యూటర్న్ తీసుకుంటుండగా హైదరాబాద్ నుంచి పరిగి రోడ్డు వైపు వెళ్తున్న లారీ కిందపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు.

ఆటో బోల్తా.. మహిళ దుర్మరణం

- మరో నలుగురికి స్వల్ప గాయాలు
- అడవి పందులు అడ్డు రావడంతో ప్రమాదం

చేవెళ్ల, ఫిబ్రవరి 22 : అడవి పందులు ఆటోకు అడ్డురావడంతో బోల్తాపడిన ఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే మృతిచెందగా మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రామన్నగూడ గ్రామానికి చెందిన చాకలి మల్లేష్ ఆటోలో అదే గ్రామానికి చెందిన పెద్దోళ్ల లక్ష్మమ్మ(60), విఠలయ్య, ఖాజామియా, జహంగీర్‌లు చేవెళ్లలో గురువారం జరిగిన సంతకు వెళ్లి తిరిగి ఆటోలో స్వగ్రామానికి వెళ్తున్నారు. మండల పరిధిలోని ఊరెళ్ల బ్రిడ్జి వద్దకు రాగానే అడవి పందులు వేగంగా రోడ్డు దాటేందుకు యత్నిస్తుండగా ఆటోకు ఢీకొనడంతో అదుపుతప్పి రోడ్డుపక్కన బోల్తాపడింది. ఆటోలో ఉన్న ఐదు మందిలో పెద్దోళ్ల లక్ష్మమ్మ తలకు తీవ్ర రక్తగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. క్షతగాత్రులను అంబులెన్స్‌లో చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం ఆసుప్రతికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపారు.

యూబీఐ ఏటీఎం చోరీకి యత్నం

- ఇద్దరు నిందితుల అరెస్టు

శంషాబాద్, ఫిబ్రవరి 22 : యూనియన్ బ్యాంకు(యూబీఐ) ఏటీఎం చోరీకి యత్నించిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన గురువారం ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని రాళ్లగూడ రోడ్డు ఉన్న యూనియన్ బ్యాంకు ఏటీఎం చోరీ చేయడానికి రాళ్లగూడ ఇందిరమ్మ కాలనీలో ఉండే కారు డ్రైవర్ చేవెళ్ల కృష్ణ, మరో నిందితుడు కృష్ణ(సెక్యూరిటీ గార్డు) గురువారం తెల్లవారుజామున యూనియన్ బ్యాంకులో చోరీ చేయడానికి యత్నించారు. అయితే, ఆ సమయంలో అలారం మోగడంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించారు. శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అయితే, ఏటీఎంలో నగదు తీసుకెళ్లలేదని, అలారం మోగడంతో పరారయ్యారని సీఐ బాల్‌రాజ్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

మూడిళ్లలో చోరీ

ఆమనగల్లు, ఫిబ్రవరి 22: మున్సిపాలిటీలోని పెంటతండాకు చెందిన ఇస్లావత్ రఘురామ్, జటావత్ మల్య, ఇస్లావత్ వాల్య ఇళ్లలో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై బాల్‌రామ్‌నాయక్ కథనం ప్రకారం... పెంటతండాకు చెందిన రఘురామ్ బుధవారం సొంతపని మీద హైదరాబాద్ వెళ్లాడు. ఆయన భార్య సునీత తన ఇంటి సమీపంలో ఉన్న తోటి కోడలు ఇంటికి వెళ్లింది. గురువారం ఉదయం ఆరు గంటలకు తిరిగి ఇంటికి రాగా.. తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లిచూడగా బీరువా తాళం విరగ్గొట్టి 9 గ్రాముల బంగారు చెవికమ్మలు, 20 తులాల కాళ్ల పట్టీలు, కొంత డబ్బు దుండగులు అపహరించుకెళ్లనట్లు గుర్తించింది. అదేవిధంగా తండాకు చెందిన జటావత్ మల్య , ఇస్లావత్ వాల్య ఇంట్లో తాళాలు పగుల గొట్టి దుండగులు డబ్బును అపహరించుకుపోయారు. తన ఇంట్లో రూ. 20 వేలు విలువ చేసే బంగారు , వెండి నగలు అపహరణకు గురయ్యాయని ఇస్లావత్ సునిత పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

కనుల పండువగా గోదాదేవి కల్యాణం

యాచారం, ఫిబ్రవరి 22 : మండలంలోని తక్కళ్లపల్లి గుట్టపై వెలసిన శ్రీ గోదాదేవి పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. గురువారం ఉదయం 8.30 గంటలకు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, సహస్రనామావళిపూజ, మంగళహారతి, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 12 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించారు. వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు నమో శ్రీ వేంకటేశాయ నమఃఅని నినదిస్తుండగా కల్యాణం జరిగింది. కల్యాణోత్సవం అనంతరం స్వామి వారిని పల్లకీపై ఊరేగించారు. ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. నిర్వాహకులు కె.నారాయణరెడ్డి తదితరులు భక్తులకు విశాల వసతులు ఏర్పాటు చేశారు. కాగా, శుక్రవారం గండదీపాలు, సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలుంటాయని నిర్వహించనున్నట్లు నారాయణరెడ్డి తెలిపారు.

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

నందిగామ : మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మంద్రస్వామి ఆలయంలో కల్యాణాన్ని వేదపండితుల సమక్షంలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రజాప్రతినిధులు గ్రామస్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. జడ్పీ వైస్‌చైర్మన్ ఈట గణేష్, మాజీ సర్పంచ్ జిల్లెల్ల వెంకట్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వి.నారాయణరెడ్డి, ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్ వివిధ పార్టీల నాయకులు జిల్లెల్ల బాల్‌రెడ్డి, తాండ్ర గోపాల్ రెడ్డి, జంగ నర్సింలు, రాఘవేంద్రచారి, శివకుమార్‌గౌడ్ విశ్వబ్రహ్మణ సంఘం సభ్యులు శంకరయ్య, ముత్యాలు, మాధవచారి, బ్రహ్మచారి, రమేష్, శ్రీనివాస్, నందమయ్య ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.



చేవెళ్ల : న్యాలట గ్రామంలో జరిగిన మహా పడిపూజలో పాల్గొన్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య



యాచారం : వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు, పాల్గొన్న భక్తులు

ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

తలకొండపల్లి : మండల పరిధిలోని పాతకోట తండాలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి దేవాలయంలో గురువారం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. దేవాలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అర్చకుల వేద మంత్రాల నడుమ విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఆమనగల్లు మాజీ మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వారికి సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండు రంగారెడ్డి, కృష్ణనాయక్, బీచ్యానాయక్, జీర్యానాయక్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

తలకొండపల్లి మండలం పాతకోట తండాలో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ చేయూతనందించారు. ఆలయంలో జరిగిన విగ్రహ, ధ్వజ స్థంభ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి రూ.17వేల ఆర్థికసాయం అందజేశారు. నిర్వాహకులు శ్రీనివాస్‌ను సత్కరించారు.

దైవచింతన అలవర్చుకోవాలి

చేవెళ్ల : ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని న్యాలట గ్రామంలో శివప్ప ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. శివస్వాములు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మహాశివుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. గ్రామం శివనామస్మరణతో మార్మోగింది. పూజా కార్యక్రమంలో ఎంపీ, చేవెళ్లలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని సూచించారు. దైవచింతనతోనే మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పి.ప్రభాకర్, మాజీ సర్పంచ్ లక్ష్మి, సీనియర్ నాయకులు ఎం.కృష్ణారెడ్డి, సత్యనారాయణ, అశోక్, ఎల్లేష్, దయాకర్, చేవెళ్ల ఎంపీటీసీ రాములు, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, గురుస్వామి సురేష్, శివస్వాములు, గ్రామస్తులు, పెద్దఎత్తున భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

కడ్తాల్ : మండల పరిధిలోని బాలాజీ నగర్ తండాలో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేనావత్ శివనాయక్ ఆధ్వర్యంలో ఆలయాన్ని నిర్మిస్తున్నారు. బీచ్య బావోజీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. దైవ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు పాలు ంచుకోవాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీచ్యబావోజీ, రాజు, కిరణ్, రవికుమార్, బీచ్య, సక్రు , రాజు, జైపాల్, కృష్ణ, రఘు, న రేశ్, తదితరులు పాల్గొన్నారు.



వాహనంపై బండి సంజయ్ తదితరులు

విజయ సంకల్ప యాత్రకు బీజేపీ శ్రేణుల స్వాగతం

చౌదరిగూడ, ఫిబ్రవరి 22 : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టి విజయ సంకల్ప యాత్ర గురువారం సాయంత్రం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని లాల్‌పహాడ్‌కు చేరుకుంది. బీజేపీ మండలాధ్యక్షుడు కురుమయ్య ఆధ్వర్యంలో జిల్లేడ్ చౌదరిగూడ నాయకులు షాబాద్‌కు వెళుతుండగా ఘన స్వాగతం పలికారు. పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, కోశాధికారి శాంతకుమార్, జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకురాలు శ్రుతి, జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి, బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, అనిల్‌కుమార్, శంకర్, నర్సింలు, రాజు, యాదయ్య, మహేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి



పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

కడ్తాల్, ఫిబ్రవరి 22 :సమష్టి కృషి, ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. ప్రజా పర్యవేక్షణతో పనులు నాణ్యతగా, వేగవంతంగా జరుగుతాయన్నారు. మండలంలోని మైసిగండి గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.8లక్షలతో చేపడుతున్న అంతర్గత మురుగు కాల్వ పనులను గురువారం ఆమె పరిశీలించారు. పనులు వేగవంతంగా చేపట్టాలని సూచించారు. కడ్తాల మండలానికి ఈజీఎస్ ద్వారా సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 2.20 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. మరో 35 రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ద్వారా రూ.5 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎంపీపీ గుర్తుచేశారు. కడ్తాల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి ఆదర్శంగా నిలుపుతామని ఆమె అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సత్యం, పలువురు నాయకులు ఉన్నారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

ఆమనగల్లు, ఫిబ్రవరి 22 : కల్వకుర్తి నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నేడు(శుక్రవారం) కల్వకుర్తి పట్టణంలో నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఆమనగల్లు మండలాధ్యక్షుడు జగన్ తెలిపారు. స్థానిక గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోవాలి

మంచాల, ఫిబ్రవరి 22 : పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం లబ్ధిదారులంతా ఈకేవైసీ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జ్యోతిశ్రీ సూచించారు. గురువారం మంచాలలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలో 139 మంది రైతులు ఈకేవైసీ చేసుకోలేదని, 500 మంది రైతులు ఆధార్‌కు బ్యాంకు ఖాతాలను లింక్ చేసుకోలేదని తెలిపారు. రైతుల వివరాలు వ్యవసాయ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని, ఈకేవైసీ పూర్తి చేసుకోని రైతులు తమ సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లి బయోమెట్రిక్ చేసుకోవాలని చెప్పారు. అదేవిధంగా ఆధార్‌కు బ్యాంకు ఖాతా లింక్ కొరకు బ్యాంకు లేదా పోస్టాఫీస్‌కు వెళ్లి నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

పిల్లల రక్షణ అందరి బాధ్యత



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థినులు

కందుకూరు, ఫిబ్రవరి 22 : పిల్లల పరిరక్షణ ప్రతీఒక్కరు సామాజిక బాధ్యతగా భావించాలని సీడీపీవో హర్షవర్థిని అన్నారు. బాలల పరిరక్షణ రంగారెడ్డి జిల్లా విభాగం ఆధ్వర్యంలో మండలంలోని కేజీబీవీలో బాలల హక్కులు-ఎదుర్కొంటున్న సమస్యలపై గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హర్షవర్థిని మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమని, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని అన్నారు. చట్టవ్యతిరేకత దత్తత, నిస్సహాయ స్థితిలో ఉన్న బాలలు, యువత మత్తు పదార్థాలకు ఏ విధంగా బానిసలు అవుతున్నారనే విషయాలపై వారు అవగాహన కల్పించారు. డీహెచ్ఈవో మహిళా సాధికారిత కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ మంజుల మాట్లాడుతూ మహిళా సమస్యలు-సాధికారిత, సమస్యలు ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై సూచనలు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సబిత, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

మంచాల, ఫిబ్రవరి 22 : క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనేత కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి యువకులకు పిలుపునిచ్చారు. మంచాల మండల పరిధి ఆరుట్లలో శ్రీ వేణుగోపాలస్వామి జాతరను పురస్కరించుకుని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రికెట్ పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యం పెంపొందడంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, రావుల బాష, గుడ్డిమల్ల చంద్రయ్య, మార సురేష్, వెదిరె రమణారెడ్డి, ఎన్నిదుల సురేష్, వెంకటేష్, భాస్కర్, అశోక్, నాగరాజు, రాఘవేందర్, నూకం రాయుడు, జిలమోని శ్రీనివాస్, శంకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి

పేదలకు అండగా ఉంటా



పుస్తె, మెట్టెలు అందిస్తున్న తాండ్ర విజయలక్ష్మి

కేశంపేట, ఫిబ్రవరి 22: నిరుపేదలకు అండగా ఉంటానని, పేదింటి ఆడపిల్ల పెళ్లిళ్లకు తన వంతు సాయం చేస్తానని పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన అబ్బి భిక్షపతి-హంసమ్మల కూతురు గీత వివాహం గురువారం జరగగా తన తల్లి విజయలక్ష్మీతో పెళ్లి కూతురు తల్లితండ్రులకు పుస్తె, మెట్టలను ఇప్పించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు పుస్తె, మెట్టలను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా భిక్షపతి కుటుంబ సభ్యులు తాజా మాజీ సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

శంకర్‌పల్లి ఫిబ్రవరి 22 : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. గురువారం గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ధర్మన్నగారి వెంకట్‌రెడ్డి వారి సమక్షంలో తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమె మాట్లాడుతూ 10 సంవత్సరాలు నియంత పాలనలో ఉన్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం అండగా ఉంటోందని చెప్పారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు. బీంభరత్, ఉదయ్‌మోహన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, ఏజాస్, బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, రాజుగౌడ్, రవీందర్‌రెడ్డి, పాల్గొన్నారు.



చైర్‌పర్సన్ సునీతారెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న వెంకట్‌రెడ్డి, తదితరులు

విధుల్లో చేరిన స్టాఫ్ నర్సులు

ఆమనగల్లు , ఫిబ్రవరి 22 : ఆమనగల్లు సీహెచ్‌సీ ఆసుపత్రికి 14 మంది నర్సులను కేటాయించారు. ఈమేరకు గురువారం ఆరుగురు విధుల్లో చేరారు. డాక్టర్లు జయశ్రీ, మంజులా దేవిల సమక్షంలో విధుల్లో చేరారు. విధినిర్వాహణ అంకిత భావంతో నిర్వర్తించి ప్రజల అభిమానం చూరగొనాలని డాక్టర్లు వారికి సూచించారు. వైద్య సిబ్బంది జంగయ్య, సునిత, వేణు, సతీష్, హన్మంత్, గోపాల్‌రెడ్డి, వెంకటయ్య, గుజ్జరి శ్రీను, సంధ్య, మంగ, ఆనంద్, సలీమా, రమేశ్, శారద, నూతనంగా విధుల్లో చేరిన నర్సులు గాయత్రి, భూలక్ష్మి, సాయిలక్ష్మి, రేణుక, అనూష, జ్యోతి, మేరి, తదితరులు పాల్గొన్నారు.



విధుల్లో చేరిన నర్సులతో వైద్యాధికారులు జయశ్రీ, మంజులా దేవి

మొక్కలను సంరక్షించాలి



మొక్కలను నీరు పడుతున్నరాంపాల్

ఆమనగల్లు, ఫిబ్రవరి 22 : నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ కోరారు. ఆమనగల్లు పట్టణంలో హరితహారం మొక్కల పెంపకంపై అధికారులతో చైర్మన్ రాంపాల్ నాయక్ సమావేశమయ్యారు. నాటే మొక్కల స్థలాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై మున్సిపల్ సిబ్బందితో కలిసి మొక్కలకు నీరు పోశారు. వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు లక్ష్మణ్, చెన్నకేశవులు, విజయ్‌కృష్ణ, సుజాతరాములు, యాదమ్మశ్రీశైలం యాదవ్, దివ్యశ్రీకాంత్, జ్యోతినర్సింహ, విక్రమ్ రెడ్డి, కృష్ణ, తదితరులున్నారు.

ఎన్‌టీటీ డాటా, నిర్మాణ్ సహకారం మరువలేనిది

కేశంపేట, ఫిబ్రవరి 22: మండల పరిధిలోని కొత్తపేట గ్రామ అభివృద్ధికి ఎన్‌టీటీ డాటా, నిర్మాణ్ సంస్థ అందిస్తున్న సహకారం మరువలేనిదని కేశంపేట మండల ఇన్‌చార్జి ఎంఈవో మనోహర్ అన్నారు. కొత్తపేట గ్రామంలో గురువారం రూ.12లక్షలతో ఆరోగ్య ఉపకేంద్రంలో మరమ్మతులు, ఫర్నీచర్, గ్రామస్తుల కొరకు 2000 లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటుచేసి ప్రారంభించారు. అలాగే మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేసి 500మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా కొత్తపేట హైస్కూల్‌లో హెచ్‌ఎం చంద్రశేఖర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జి ఎంఈవో మాట్లాడుతూ ఎన్‌టీటీ డాటా, నిర్మాణ్ సంస్థ కొత్తపేట పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారని కితాబిచ్చారు. పాఠశాలలో రంగులు, ఫర్నీచర్, మౌలిక సదుపాయాలు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ పసుల మల్లేష్‌యాదవ్, కో-ఆప్షన్ సభ్యుడు జమాల్‌ఖాన్, తాజా మాజీ సర్పంచ్ నవీన్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ నరేష్, సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాస రావు, శ్రీనివాస సాగ ర్, ఎన్‌టీటీ సీనియర్ డైరెక్టర్స్ గజేంద్ర, ప్రతాప్, సోమేష్, ప్రసాద్, నిర్మాణ్ సీవోవో అనురాధ, హచ్‌వోపీ నిఖిల్ తదితరు లు పాల్గొన్నారు.



ఎన్‌టీటీ డాటా, నిర్మాణ్ సంస్థ ప్రతినిధులతో ఉపాధ్యాయులు